క్లుప్తంగా

18న సైన్స్ ప్రతిభ పరీక్షలు



శావల్యాపురం: జన విజ్ఞాన వేదిక సారథ్యంలో సైన్స్ సంబరాల్లో భాగంగా ఈ నెల 18న పాఠశాల స్థాయిలో సైన్స్ ప్రతిభ పరీక్ష జరుగుతుందని మండల కన్వీనర్ జ్యోతి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం శావల్యాపురంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల పరిధిలో 360 మంది 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు ప్రతిభ పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్లా, శ్రీనివాసరావు, శివ రామకృష్ణ, రఘునాథ్‌బాబు, హరీష, శివ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



వినుకొండ: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం వైద్య శిబిరాల నిర్వహణ వంటి సేవా కార్యక్రమాలకు రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ప్రాధాన్యత ఇస్తుందని క్లబ్ అధ్యక్షుడు యేరువ వెంకట నారాయణ తెలిపారు. పట్టణంలోని హనుమాన్‌నగర్ ప్రాథమిక పాఠశాలకు బీరువాను, ఓబయ్య కాలనీలోని మండల విద్యావనరుల కేంద్రానికి పోర్టబుల్ మైక్ సెట్‌ను రోటరీ క్లబ్ సభ్యులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన నాగేంద్రుడు మాస్టారు వంటి దాతల సహకారంతో ఈ లక్ష్యాలను నెరవేర్చడంలో పురోగతి సాధిస్తున్నామని తెలిపారు. అనంతరం దాత నాగేంద్రుడు మాస్టారును పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎంఎస్ షేక్ బాజీ, ట్రెజరర్ పొత్తూరి నవీన్, జిల్లా ముఖ్యులు ఆలా శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటర్ కూచి రామాంజనేయులు, ఎంఈవో జఫ్రుల్లా, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికాభివృద్ధే సమాజ ప్రగతి

ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి



రొంపిచర్ల: బాలికల విద్యాభివృద్ధి సమాజ ప్రగతికి దోహదపడుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి అన్నారు. స్థానిక డ్వాక్రా భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కిశోర బాలికల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, సాధికారితపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే గర్భిణులకు సీమంతం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మొండితోక రామారావు, తహసీల్దార్ బండి నిర్మల, ఎంపీడీవో మ్యాథ్యూబాబు, సీడీపీవో కాంతకుమారి, మాణిక్యరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు సమీరుల్లా, మరియకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్‌లో ధనూజ ప్రతిభ



చిలకలూరిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ఈ నెల 10 నుంచి 13 వరకు రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ స్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీలలో 70 నుంచి 75 కేజీల విభాగంలో ఏఎంజీ హైస్కూల్ విద్యార్థిని బి.ధనూజ పాల్గొని రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినిని అభినందించిన వారిలో ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సురేష్‌కుమార్, హైస్కూల్ హెచ్‌ఎం కె.కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్ ఉన్నారు.

పాతపాటేశ్వరి ఆలయంలో పేదలకు అన్నదానం

గురజాల: దాతల సహకారం మరువలేనిదని స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాథం అన్నారు. స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం నిరుపేదలు, యాచకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందోలు రాంబాబు, కుమారి, సత్యప్రియలు అన్నదాన కార్యక్రమంకు సహకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బండి రవికుమార్, గుండా సైదారావు, రావూరి సతీష్, కనకం హనుమంతరావు తదితరులున్నారు.

సంపద కేంద్రం.. నిరుపయోగం



ముళ్ల పొదలతో నిండిపోయిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం



కేంద్రంలో బీరు బాటిల్స్

నరసరావుపేట రూరల్: చెత్త నుంచి సంపద తయారీ లక్ష్యంతో ప్రారంభించిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం మూలనపడింది. మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో పారిశుద్ధ్యాన్ని పెంపొందిస్తూ పంచాయతీకి ఆదాయ వనరుగా మారుతుందనే సదుద్దేశంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన షెడ్‌ను నిరుపయోగంగా మార్చారు. గ్రీన్ అంబాసిడర్లు చెత్తను సేకరించి ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలకు తరలించి తడి, పొడి చెత్తను వేరు చేయాల్సి ఉంటుంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

వ్యర్థాల నుంచి ఎరువులను తయారు చేయడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరనుంది. పంచాయతీ సిబ్బంది ఈ లక్ష్యాన్ని నీరుగారుస్తూ గ్రామంలో సేకరించిన చెత్తను గ్రామ శివారులో రోడ్ల వెంట పడవేస్తున్నారు. మరో వైపు ఈ కేంద్రం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. వ్యర్థాల నిర్వహణ చేపట్టాల్సిన కేంద్రంలో బీరు, మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి.

● దీనిపై పంచాయతీ కార్యదర్శి గాబ్రియేలును వివరణ కోరగా గతంలో కేంద్రం నిర్వహించి వర్మీ కంపోస్ట్‌ను తయారు చేసాం. రాత్రి వేళల్లో గంజాయి బ్యాచ్ కేంద్రం తాళాలు పగులగొట్టి ప్లాస్టిక్‌తో పాటు వర్మీ ఎరువులను ఎత్తుకెళ్ళారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినా చర్యలు లేకపోవడంతో కేంద్రం మూసివేసామని తెలిపారు.

బాలోత్సవ వేడుకలు విజయవంతం చేయండి

ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు



ప్రధానోపాధ్యాయురాలికి ఆహ్వాన పత్రికను ఇస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

శావల్యాపురం: జిల్లా స్థాయిలో నవంబరు 29, 30 తేదీల్లో బాలోత్సవ తృతీయ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు బాలోత్సవ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఈ వేడుకలు జరుగుతాయని ఇందులో ఎల్‌కేజీ నుంచి 10 తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు. మొత్తం 65 రకాల కార్యక్రమాలు లఘు నాటికలు, బుర్ర కథలు, మట్టి బొమ్మలు, కోలాటాలు, శాస్త్రీయ నృత్యాలు, సైన్సు ప్రయోగాలు, కథలు చెప్పటం తదితర వాటిపై పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని ఉపాధ్యాయులను స్వయంగా కలిసి ఆహ్వానించుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, వినుకొండ నియోజకవర్గ బాలోత్సవ కమిటీ ఇన్‌చార్జి, పాఠశాల సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ వెంకట నాగేశ్వరరావు, నెల్లూరు బ్రహ్మయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రతినిధి కోట సాయి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యడ్లపాడు: మండలంలోని పుట్టకోట గ్రామంలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని చిలకలూరిపేట విద్యుత్ శాఖ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పనులలో భాగంగా విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గృహ, వాణిజ్య, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపి వేయబడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని డీఈఈ కోరారు.

ఇస్సపాలెంలో చోరీ



నరసరావుపేట రూరల్: మండలంలోని ఇస్సపాలెంలో భారీ చోరీ జరిగింది. గ్రామంలోని శ్రీనివాస వెంచర్‌లో సత్తెనపల్లిలోని ఓ బ్యాంక్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న దంపతులు నివసిస్తున్నారు. వీరు ఈ నెల 9వ తేదీ అరుణాచలం వెళ్లి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు తీసి, తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. రూరల్ ఎస్ఐ కిషోర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు 100 గ్రాముల బంగారం చోరీ అయినట్టు బాధితులు పోలీసులకు తెలిపారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దీపావళి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

రూరల్ సీఐ బ్రహ్మయ్య

శావల్యాపురం: దీపావళి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వినుకొండ రూరల్ సీఐ బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాలకు అనుగుణంగా వినుకొండ రూరల్ పరిధిలో బాణసంచా అమ్మకాలు జరిపే వారు లైసెన్సు కలిగి ఉండాలన్నారు. క్రాకర్స్ కాల్చు సమయంలో ప్రమాదాలు జరగకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాణసంచా అమ్మకాలు విషయంలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే బాణసంచా అమ్మే దుకాణాల వద్ద అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి దుకాణం వద్ద నో స్మోకింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు స్థానిక పోలీసులతో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి



ముప్పాళ్ళ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌలు రైతు సంఘం నేత బాలకృష్ణ, తదితరులు



తహసీల్దార్ వనాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతుసంఘం ప్రతినిధులు

ముప్పాళ్ళ: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని రైతు సంఘం నేత గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. బాలకృష్ణ మాట్లాడుతూ రైతులతో పాటీ కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, రుణ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కె.నగేష్‌కు అందించారు. కౌలు రైతు సంఘం నాయకులు తొరటి అమరలింగేశ్వరరావు, పెద్దిరెడ్డి, మారూరి జగన్మోహనరెడ్డి, వెంకటేశ్వర్లు, జాన్‌పీరా, రైతులు పాల్గొన్నారు.

క్రోసూరు: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అందించాలని కోరుతూ క్రోసూరు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం మండల నాయకులు మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి, వారికి న్యాయం చేస్తామని కూటమి హామీ ఇచ్చి 18 నెలలు కావస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు చెల్లించి ఆదుకోవాలన్నారు. ఈ మేరకు అర్జీని తహసీల్దార్ వి.వి.నాగరాజుకు అందజేశారు. కౌలు రైతు సంఘం మండల కమిటీ సభ్యులు కుంబా లక్ష్మయ్య, నరసింహారావు, కోటయ్య, పెరికల శ్రీను, వెంకటేశ్వర్లు, మల్లెల సేవిరి పాల్గొన్నారు.

● ఇదేం కర్మ.. దేవుడా..!



పెచ్చులూడిన కర్మకాండల గది శ్లాబు

మరమ్మతులకు గురైన కర్మకాండల గది

నాదెండ్ల: గణపవరం హిందూ శ్మశాన వాటికలోని కర్మకాండల గది మరమ్మతులకు గురైంది. సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ గది ప్రస్తుతం శ్లాబు నెర్రలిచ్చి పెచ్చులూడి పడుతున్నాయి. ఇటీవల ఓ కుటుంబం వారు పిండ ప్రదానం చేసే సమయంలో శ్లాబు పెచ్చులూడి పడటంతో భయభ్రాంతులకు గురయ్యారు. ఐదు సచివాలయాలు ఉన్న మేజర్ పంచాయతీ గణపవరంలో 20 వేల పైబడి జనాభా ఉంది. గ్రామంలో ముస్లిం, ఎస్సీ, హిందూ శ్మశాన వాటికలు ఉన్నాయి. హిందూ శ్మశాన వాటికలో కర్మకాండల గదిని అధికారులు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎస్.మారుతీబాబును వివరణ కోరగా, హిందూ శ్మశాన వాటికలోని కర్మకాండల గదిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాల నిర్వహణపై వినుకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబరు బొల్లా బ్రహ్మనాయుడు నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లా మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణ విస్తృతంగా చేపట్టాలని సూచించారు. నియోజకవర్గంలో గ్రామ స్థాయిలోని ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో సంతకాలు సేకరించడం, ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రైవేటీకరణ పేద విద్యార్థులకు, సామాన్య ప్రజలకు వైద్య విద్యను, వైద్య సేవలను దూరం చేస్తుందని వివరించారు. గ్రామాల్లో నాయకులు సేకరించిన సంతకాలను వినుకొండ పార్టీ కార్యాలయానికి పంపించాలని తరువాత గవర్నర్‌కు సమర్పించడానికి సిద్ధం చేయాలని తెలిపారు. రచ్చబండ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విజయవంతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

జాతీయ క్రికెట్ పోటీలలో రన్నరప్‌గా ఏఎంరెడ్డి కళాశాల



నరసరావుపేట రూరల్: జాతీయ స్థాయి క్రికెట్ పోటీలలో ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రన్నర్స్‌గా నిలిచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున్ మంగళవారం తెలిపారు. ఇ-లెవన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌కేఆర్‌బీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో వివిధ రాష్ట్రాలకు చెందిన జట్లు పాల్గొన్నాయని తెలిపారు. ఈ పోటీలలో తమ కళాశాల క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జట్టును రన్నరప్‌గా నిలిపినట్టు వివరించారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతిశ్రీనివాసరెడ్డి, డిప్లమా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, వ్యాయామ అధ్యాపకులు ఇమ్మానియేలు, కె.ఈశ్వరిప్రసాద్‌లు క్రీడాకారులను అభినందించారు.

● కనువిందు చేస్తున్న గిజిగాడు గూళ్లు



ప్రకృతిలో సొంత గూడు కట్టుకునే పక్షుల్లో గిజిగాడు ప్రత్యేకం. ఎత్తయిన చెట్ల కొమ్మల చివరన అద్భుతమైన రీతిలో గూడు కట్టి, గుడ్లు పెట్టి పొదిగే గిజిగాడు పక్షులు రానురాను కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు కిలకిలారావాలతో అలరించిన ఎన్నో రకాల పక్షులు.. వృక్షాలు తగ్గిపోవటం, సెల్‌ఫోన్ తరంగాలు, వాతావరణ కాలుష్యం కారణంగా అంతరించిపోతున్నాయి. స్వయం ఇంజనీర్లుగా ప్రసిద్ధికెక్కిన గిజిగాడు పక్షులు అక్కడక్కడ మాత్రమే దర్శనమిస్తున్నాయి. గణపవరం-నాదెండ్ల డొంక రోడ్డులో నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఈత చెట్లకు గిజిగాడు గూళ్లు కనువిందు చేస్తున్నాయి. సాయంత్రం గూళ్లలోకి చేరి సందడి చేస్తున్నాయి.

– నాదెండ్ల

నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్ అందజేత



దాచేపల్లి: ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో సర్వీస్ రిజిస్టర్లు, క్యాలెండర్, పాకెట్ బుక్కులను మంగళవారం అందజేశారు. మండల వ్యాప్తంగా 41 మంది స్కూల్ అసిస్టెంట్లు, నలుగురు ఎస్జీటీలు, మరో ప్రధానోపాధ్యాయుడికి ఈ సర్వీస్ రిజిస్టర్లు, క్యాలెండర్లను ఎంఈవో పినాకపాణి చేతుల మీదుగా అందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఎంఈవో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సోము వెంకటరమణ, ఏసురత్నం, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, రాములు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ స్వర్ణమ్మభాయ్

అచ్చంపేట: మండలంలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి సంబంధిత అధికారులంతా కృషి చేయాలని ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మభాయ్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. వివిధ శాఖల పురోగతిపై అధికారులు ప్రగతి నివేదికలను సభ ముందుంచారు. మండలంలోని కొన్ని ఆరోగ్య ఉప కేంద్రాల్లో నామమాత్రపు మందులు కూడా ఉండటంలేదని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. తాళ్లచెరువు సబ్ సెంటర్‌లో పారాసెట్మాల్ టాబ్లెట్స్ కూడా లేకపోవడంపై సభ్యులు మండి పడ్డారు. మరికొన్ని గ్రామాల్లో మంచినీరు రావడంలేదని, అధికారులు పట్టించుకోవడంలేదని సభ్యులు ప్రశ్నించారు. రోకటిగుంటవారిపాలెంలో మంచి నీటి సమస్య ఎప్పటినుంచో ఉందని, గత సమావేశాల్లో కూడా ఈ విషయంపై ప్రస్తావించినా ఎలాంటి చర్యలు లేవని సర్పంచ్ రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రమైన అచ్చంపేటకు వివిధ పనులపై గ్రామాలనుంచి ప్రజలు వస్తుంటారని వారికి సరైన టాయిలెట్స్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు తెలిపారు. వెంటనే అచ్చంపేటలో సరైన స్థలం చూసి పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ స్వర్ణమ్మభాయ్.. ఎంపీడీవో శ్రీనివాసరావుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.చంద్రశేఖర్, ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఐక్యంగా జీవించండి

సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు



కోటనెమలిపురి గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

రాజుపాలెం: గ్రామాల్లో అందరూ కలసిమెలసి జీవించాలని సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు గ్రామస్తులకు సూచించారు. మండలంలోని కోటనెమలిపురిలో సత్తెనపల్లి డీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకు డీఎస్పీ, సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్ సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, 70 మంది పోలీస్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని జల్లెడ పట్టారు. గ్రామ రోడ్లలో కవాత్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతుంటే తమ దృష్టికి తేవాలని తెలిపారు. గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సీ కాలనీ సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల విగ్రహాల వద్ద ఉన్న ఖాళీ స్థలం గూర్చి తహసీల్దార్ ఇరువర్గాలతో మాట్లాడతారని, అల్లర్లు సృష్టించుకోవద్దని, సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



కర్రి పార్వతి

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన వివాహిత కర్రి పార్వతి అదృశ్యమవడంపై కేసు నమోదయిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్సై బాజీ తెలిపిన వివరాల మేరకు కర్రి పార్వతి ఈ నెల 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు దేవాలయానికి వెళుతున్నానని ఇంటిలో చెప్పి వెళ్లి కనిపించకపోవటంతో భర్త నాగేశ్వరరావు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మండలంలోని గంటావారిపాలెం గ్రామంలోని తిరుపతమ్మ దేవాలయం సమీపంలో కర్రి పార్వతి, గోనుగుంట్ల ఏడుకొండలతో మాట్లాడి వెళ్లిందని అప్పటి నుంచి ఇంటికి రాలేదని.. భర్త నాగేశ్వరరావు స్వగ్రామం వినుకొండ రూరల్ పిట్టంబండ గ్రామం కాగా పుట్టినిల్లు వేల్పూరు గ్రామం అని ఏఎస్సై బాజీ విలేకర్ల సమావేశంలో తెలియజేశారు. ఆచూకీ తెలిసిన వారు శావల్యాపురం పోలీసు స్టేషను 08646-259335 నంబరుకు గానీ, ఫిర్యాదు దారు 9951783813 నంబరుకు గానీ తెలియజేయాలని ఏఎస్సై కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై బాజీ తెలిపారు.